క్లుప్తంగా

వీధి నాటకం ప్రారంభం



వేదికపై రోహిత్‌రెడ్డి, కళాకారులు

పెద్దేముల్: కంప్యూటర్ యుగంలో నాటకాల ప్రదర్శన చేపట్టడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి 10గంటలకు మండల పరిధి మారేపల్లితండాలో 'మార్కండేయ' వీధి నాటకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వీధి నాటకాలు, దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు పాండు నాయక్, సంతోష్‌నాయక్ ఉన్నారు.

ఎస్సీల వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం

ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి మహేందర్



ప్రచారం చేస్తున్న నాయకులు

యాలాల: ఎస్సీల వర్గీకరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్టు పార్టీ) జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్టి సూర్యప్రకాశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా గోరేపల్లి, ముకుందాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బీజేపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నామని వెల్లడించారు. మాదిగల ఆకాంక్షను బీజేపీ నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి, కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్ అజయ్ ప్రసాద్, శ్రావణ్ ఉన్నారు.

జేపీ దర్గాలో ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి

కొత్తూరు: మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని జేపీ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆయన దర్గాను దర్శించుకున్నట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు పెంటనోళ్ల యాదగిరి, అజయ్‌నాయక్, ఇంద్రసేనారెడ్డి, మిట్టునాయక్, తస్లీమ్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: ఇరవై ఐదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ సుదీర్ఘ కాలం అనంతరం ఏకమై.. ఒకే వేదికగా సందడిచేశారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కేరింతలు కొట్టారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధి కందవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు ఆదివారం మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాల రోజుల్లో చేసిన చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, యోగక్షేమాలను తెలుసుకున్నారు. చదువుకునే రోజులను గుర్తుచేసుకొని సరదాగా గడిపారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల పరిధి పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన బాల్య మిత్రులు.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 38 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రబృందం.. నాటి చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు యోగాక్షేమాలతో పాటు, కుటుంబసభ్యుల వివరాలను తెలుసుకొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు బీమయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అబ్బి సుందరయ్య, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, సురేందర్‌రెడ్డి, నర్సింలు, అమరేందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు.. తయారీ కరువు

- నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు
- చెత్త సేకరణలో సిబ్బంది నిర్లక్ష్యం



దుగ్గాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న షెడ్

పెద్దేముల్: వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసి, తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంతో పాటు, సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం కంపోస్టు షెడ్లకు (సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం) శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండల పరిధి 37 గ్రామాల్లో ఒక్కో షెడ్డుకు రూ.2లక్షలు కేటాయించి, 37 కంపోస్టు షెడ్లకు నిధులు మంజూరు చేసింది. అప్పట్లో సర్పంచ్‌లకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. సకాలంలో షెడ్లు పూర్తయ్యాయి. ప్రారంభంలో ఆర్భాటం చేసినా.. క్రమంగా అటకెక్కింది. దీంతో సర్కారు లక్ష్యం నీరుగారి, షెడ్లు నిరుపయోగంగా మిగిలాయి.

ప్రాధాన్యత చూపని అధికారులు

ప్రజల నుంచి సేకరించిన తడి–పొడి చెత్తను వేరు చేసి, షెడ్లకు తరలించాలి. ఆ తరువాత ప్లాస్టిక్, సీసలతో పాటు ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావటం లేదు. వ్యర్థ పదార్థాలు, కూరగాయల వ్యర్థాలతో చేసిన సేంద్రియ ఎరువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు పంచాయతీ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువు తయారైన తరువాత స్థానిక రైతులకు విక్రయించి, పంచాయతీకి వనరులు సమకూర్చుకోవాలని మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్, డీపీఓలు ప్రతి సమావేశంలో సూచించేవారు. కానీ ఆ దిశగా అడుగులు పడలేదని, అందుకు కారణం సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమేనన్న ఆరోపణలు లేకపోలేదు.

గుంతల్లో డంప్

తడి–పొడి చెత్త సేకరణకు ప్రభుత్వం ప్రతి జీపీకి ట్రాక్టర్లను సమకూర్చింది. ప్రజల నుంచి సేకరించిన చెత్తను ఆయా వాహనాల్లో కంపోస్టు షెడ్లకు తరలించి, ఎరువు తయారీకి ఉపయోగించాలి. కానీ.. జీపీ సిబ్బంది గుంతల్లో డంప్ చేస్తున్నట్లు సమాచారం. మేజర్ పంచాయతీల్లో సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియ సక్రమంగా జరిగితే.. చిన్న గ్రామాల్లో ఆ దిశగా పనులు కొనసాగుతాయని, అధికారులు పట్టించుకోక పోవడం వల్లే.. ఎరువుల తయారీని జీపీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

కానరాని వాన పాములు

ఏడాది క్రితం సేంద్రియ ఎరువుల తయారీకి ప్రభుత్వం వాన పాములను సరఫరా చేసింది. ఒక్కో జీపీకి సుమారు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు చేసి వాటిని పంపిణీ చేసింది. ఆ పాములను కంపోస్టు షెడ్లల్లో చెత్త–చెదారం వేసి, అందులో వేయాలి. అనంతరం రెండు రోజులకు ఒకసారి పర్యవేక్షించి, సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియను ముందుకు సాగించాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదని పెద్దేముల్, చైతన్యనగర్, అడ్కిచెర్ల, బండమీదిపల్లి, జైరాంతండా, ఇందూరు, గోట్లపల్లి గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

సరైన కార్యదర్శి లేకే..



సేంద్రియ ఎరువుల తయారీ నెమ్మదించింది. పట్టించుకునే వారు లేక.. ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అందుకు కారణం పంచాయతీకి శాశ్వత కార్యదర్శి లేక పోవడమే. తద్వారా కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారి, ఎరువు తయారీ క్రమంగా కనుమరుగవుతోంది. సేకరించిన చెత్తను జీపీ సిబ్బంది ఎక్కడ పడితే అక్కడ పారబోస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం శూన్యం.

– ఆజీం, రైతు, పెద్దేముల్

వినియోగంలోకి తెస్తాం

కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకొస్తాం. అవసరం అయితే పంచాయతీ కార్మికులకు శిక్షణ ఇస్తాం. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు గ్రామ ప్రజల సహకారం ముఖ్యం. తడి–పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసేలా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

– రమేష్, ఇన్‌చార్జి ఎంపీఓ, పెద్దేముల్

బీజేపీతోనే దేశం అభివృద్ధి

మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు



పూడూరు: గొంగుపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

పూడూరు: 'బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందింది. చెందుతుంది. నిరంతరం ప్రజా సంక్షేమ కోసం పాటుపడే మోదీ పాలననే ప్రజలు కోరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం' అని కమలనాథులు ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పూడూరు మండల పరిధి గొంగులపల్లిలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్, పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఓటర్లకు వివరించారు. అనంతరం పటేల్ మాట్లాడారు. మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని తెలిపారు. అర్హులందరికీ అనేక సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. దేశం, రాష్ట్ర మరింత అభివృద్ధి చెందాలన్నా, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా కమలం గుర్తుకు ఓటు వేసి, పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, మండల ఇన్‌చార్జి రాము యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అనీల్, నాయకులు రాజేష్‌గౌడ్, వెంకటయ్య, రాజు, సుభాన్, మహేశ్, సత్తయ్య ఉన్నారు.

కేంద్రం నిధులతోనే..

బంట్వారం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ కేంద్రం నిధులతోనేనని జరిగాయని బీజేపీ నాయకుడు వడ్ల నందు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోట్‌పల్లి మండల పరిధి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించి, పార్టీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు రాంపూర్ వాసులు బీజేపీలో చేరారు. ఇందులో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మహేశ్ గౌడ్, బందెయ్య, నాయకులు రాజు ఉన్నారు.

మోదీ పాలనతో సంతృప్తి

అనంతగిరి: ప్రధాని మోదీ మరోసారి గెలవాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అవినీతి రహిత పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. అందుకే దేశ ప్రజలు ఆయన్ను మరలా ఎన్నుకోవాలని చూస్తున్నారని వెల్లడించారు. ఇందులో భాగంగా పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, నియోజకవర్గాన్ని మోదీకి కానుకగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న ఎస్‌ఏపీ కళాశాల మైదానంలో నిర్వహించే కేంద్ర మంత్రి అమిత్‌షా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, కొండా తనయుడు విశ్వజిత్, రాష్ట్ర నాయకులు రాంచంద్రయ్య, నరేష్ మహరాజ్, కేపీ రాజు, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, విజయ భాస్కర్, సతీష్, శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరీష, పట్టణ పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అనిల్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సహజ హక్కులను కాపాడుకుందాం

- ఎజెండాల అమలుకు పోరాటం చేద్దాం
- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: రాజకీయ పార్టీలు, వారి ఎజెండాలను అమలు చేసే వరకు పోరాటం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ సహజ హక్కులను కాపాడుకోవాలని చెప్పారు. రాజ్యాంగ హక్కులు, విలువల రక్షణ కోసం ఉద్యమించాలని సూచించారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మే 2 నుంచి 11వ తేదీ వరకు ప్రజలను చైతన్యం చేయడానికి ప్రచారం చేస్తున్నట్లు రాఘవ పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీలు ప్రజలకు ఏం చేశారో, ఏం చేయనున్నారో చెప్పాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ విభజన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజాస్వామిక విలువలను రక్షించాల్సిన పాలకులు.. నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి పౌరుల కనీస అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ సెక్టార్లను బలోపేతం చేయాలన్నారు. పాలమూరు జిల్లా అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందని పేర్కొన్నారు. కేంద్రం.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించలేదని చెప్పారు. రాజకీయ నాయకులను దీర్ఘకాలంగా పదవుల్లో ఉంచరాదని ప్రజలను కోరారు. ప్రజా సంఘాలతో.. ప్రజలను చైతన్యం చేయడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఇందనూర్ బషీర్, ప్రజా సంఘాల నాయకులు మహమూద్, చంద్రయ్య, రమేష్‌బాబు, శ్రీనివాస్, శ్యాంసుందర్, యాదయ్య, శ్రీదేవి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో కురుమ సంఘం నాయకులు

చేవెళ్ల: మండల పరిధి తంగడపల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నాయకులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు దండు సత్తి తదితరులు ఉన్నారు.

నమ్మితే నట్టేట ముంచింది

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- మరోసారి మోసపోవద్దు
- బీఆర్ఎస్‌ను ఆదరించి ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



కుల్కచర్ల: ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: మోసపూరిత ప్రకటనలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి, నమ్మి ఓటు వేసిన ప్రజలను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన హస్తం పార్టీ.. ఆ పథకాలను అమలు చేయడంలో విఫలం అయిందని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి.. ఆగస్టులో చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ఓట్లను కొల్లగొట్టేందుకే గడువు పెంచుతూ మోసం చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు కృష్ణయ్య, శ్రీనివాస్, పెద్ద నర్సింలు, శ్రీశైలం, బిచ్చయ్య, బాలు, వెంకటయ్య, రషీదు, వెంకట్రాములు, రుక్మొద్దిన్, లక్ష్మయ్య, ఎల్లయ్య, చాకలి కృష్ణయ్య, లొద్ద నర్సింలు, ఎదుల సత్తయ్య, పుల్లారెడ్డి, యాదగిరి, సత్యయ్య ఉన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్

మోమిన్‌పేట: అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఏఎంసీ మాజీ డైరెక్టర్ కృష్ణ ఆరోపించారు. మండల పరిధి మొరంగపల్లిలో జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన వెంట పాండురంగారెడ్డి, మల్లారెడ్డి, భుజంగారెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించి..

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో తనను వెన్నుపోటు పొడిచిన నేతలు తాండూరు వదిలివెళ్లారని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అధ్యక్షతన గౌతపూర్, అల్లాపూర్, కోట్‌బాసుపల్లి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, రాజప్పగౌడ్, మాధవరెడ్డి, శకుంతల, ఉమాశంకర్, వెంకటేశం, జైపాల్‌రెడ్డి, నాగార్జున, మొగులప్ప, ప్రదీప్ రెడ్డి, సందీప్‌రెడ్డి, అమ్రేష్ ఉన్నారు.

మోసపోవద్దు

దోమ: కాంగ్రెస్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, హామీల అమలులో విఫలమయిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలు అధికంగా ఉన్నారని, చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత లభించాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య ముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు ఖాజపాష, వార్డు మాజీ సభ్యుడు సాయిలు, మైను, శ్రీనివాస్, రాములు, నవీన్, మైనొద్దీన్ ఉన్నారు.

కాసాని గెలుపు ఖాయం

పూడూరు: బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ గెలవడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. మన్నేగుడలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ తిరిగి, పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి, కాసాని గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా

బంట్వారం: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగుర వేస్తామని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే అర్హత లేదని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ కోట్‌పల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ మహేందర్, ఎంపీటీసీ అంబికారాజు ఉన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ

- మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ
- మతోన్మాద పార్టీని ఓడించాలి
- ప్రజా సంక్షేమ కాంగ్రెస్‌ను గెలిపించాలి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు



మోమిన్‌పేట: కేసారంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు టౌన్: పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద పార్టీ బీజేపీని ఓడించి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం, సీపీఐ(ఎంఎల్), న్యూ డెమోక్రసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుతం.. పేదల పొట్టలు కొట్టి, కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు ముట్టజెప్పిందని ఆరోపించారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి, వారి హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. మతాన్ని, దేవున్ని అడ్డంపెట్టుకొని, ఓట్లు అడుగుతున్న ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో.. ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇందులో తాండూరు ఇన్‌చార్జి సోమశేఖర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, న్యూ డెమోక్రసి తాండూరు ఇన్‌చార్జి శ్రీనివాస్, చంద్రయ్య, రాజు, బాలు, వెంకటేశ్, జగ్గప్ప, వెంకట్, మహేశ్, ఆదిత్య ఉన్నారు.

రుణమాఫీ చేస్తాం..

మోమిన్‌పేట: హామీ మేరకు ఆగస్టు 15వ తేదీలోపు రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి కేసారం గ్రామంలో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. అనంతరం శంకర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉంటే రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందుతుందని, అందుకు చేతి గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు సురేందర్, చంద్రయ్య, వెంకట్, మైపాల్ ఉన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యం

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ తోనే సాధ్యమని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, టీఆర్ఆర్ యువసేన మండల అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్ స్పష్టం చేశారు. చౌడాపూర్ మండల పరిధి లింగంపల్లిలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే కేంద్రంలోనూ హస్తం కొలువుదీరాల్సి ఉంటుందని, పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

పేదల పక్షపాతి..

మర్పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మండల పరిధి గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం సనగారి మట్లాడారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పేదల పక్షపాతి, ఐదేళ్ల కాలంలో ఎంపీగా ప్రజలకు సేవలదించారని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, రంజిత్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు సుభాష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్, పట్లూర్ ఎంపీటీసీ సురేష్, మాజీ సర్పంచ్ సురేష్ ఉన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్ కోరారు. వికారాబాద్‌లోని సాకేత్‌నగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే రంజిత్‌ను ఆదరించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువతకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధి గూడూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన గూడూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని, విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి అహర్నిషలు కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి ప్రభాకర్, సత్తయ్య, కాట్నరాజు, రవినాయక్, దయానంద్ గుప్త, పద్మారావు, ఆంజనేయులు, దర్శన్, రాములు, దశరథ్‌నాయక్, జయేందర్‌రెడ్డి, దయానంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకోండి

చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరును పరిశీలించి మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సాయిరాం సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ.. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి మొత్తం 2,353 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఈరోజు వరకు 538 పోస్టల్ ఓట్లు పోలైనట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసుకునేందుకు అవకాశం ఉందని, దీనిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం హోమ్ ఓటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.